: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231





విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 47 | 29-08-2022 | పుటలు : 4

**గిడుగు రామ్మూర్తి**
**1863-1940**

(ఆగస్టు 29న గిడుగు రామ్మూర్తి పంతులు గారి జయంతి)

**తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు!!**

# మెరుగైన సమాజానికి మార్గదర్శి గురువు

## ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లో వీసీ జగన్నాథరావు



ఎఫ్.డి.పి లో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

మెరుగైన సమాజ నిర్మాణానికి మార్గదర్శిగా గురువులు ఉండాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ డిపార్టమెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ సహకారంతో ఆరు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ విద్యాలయంలో జరుగుతున్నాయి. యూనివర్సిటీ ఈసి హాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఆరురోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ జరుగుతుందన్నారు. "మెంటరింగ్ ఫర్ ఇన్స్టిటూషనల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ ఫెసిలిటేషన్ ఫర్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్" అనే అంశంపై నిర్వహిస్తున్న ఎఫ్.డి.పి కార్యక్రమానికి సమన్వయకర్తలుగా ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, ఎం.జి.ఎన్.సి.ఆర్.ఇ రూరల్ మెనేజ్మెంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ సిహెచ్.చేతన్ బాబు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో సంస్థాగత నాయకులకు మార్గదర్శకత్వం, సమూహ ప్రక్రియలను సులభతరం చేయడం, గ్రామ ఇమ్మర్షన్ పద్ధతులు మరియు సాంకేతికతలు, కీలక వ్యూహాలు మరియు వ్యూహాత్మక నాయకత్వం, శిక్షణా విధానాలు చర్చలు మరియు పద్ధతులు, అకడమిక్ లీడర్ల కోసం సులభతర నైపుణ్యాలు, ఫీల్డ్ లెర్నింగ్ కోసం అసైన్మెంట్లు, ఉన్నత్ భారత్ అభియాన్ మరియు అకడమిక్ లీడర్షిప్, అకడమిక్ లీడర్షిప్లో అనుభవపూర్వకమైన అభ్యాసం, శ్రేష్ఠత కోసం మార్పును అమలు చేయడం, ఎక్సలెన్స్ కోసం మార్పును అమలు చేయడం, సంస్థాగత సమాజాన్ని అభివృద్ధి చేయడం, గ్రామీణ నాయకత్వ స్ఫూర్తి, గ్రామీణ నాయకత్వ ప్రేరణ, రూరల్ అడ్మినిస్ట్రేషన్, రూరల్ డెవలప్మెంట్, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ ప్రాసెస్, అడ్మినిస్ట్రేటివ్ లీడర్షిప్, ఇన్స్ట్రక్షన్ లీడర్షిప్, ఆపరేషనల్ లీడర్షిప్, అకౌంటబిలిటీ మ్యాచ్ వంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. గురువులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని, నిత్యం సమాజ హితాన్ని కోరుకోవాలని చెప్పారు. సమాజానికి ప్రయోజనకరమైన స్వచ్ భారత్ వంటి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రజలను జాగృతం చేయడం, గ్రామాలను దత్తత తీసుకోవడం, నోడల్ ఆఫీసర్స్ ద్వారా ఆయా ప్రాంతాలను పర్యవేక్షిస్తుండాలన్నారు. పర్యావరణాన్ని ప్రేమించడం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం ప్రజలందరినీ జాగృతం చేయాలని, తద్వార సస్టైనబుల్ డెవలప్మెంట్ సాధ్యమవుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డైరెక్టర్ సిహెచ్.చేతన్, ఆయా కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



వక్రతుండ మహాకాయం
కోటి సూర్య సమప్రభ !
నిర్విఘ్నం కురుమే దేవ
సర్వకార్యేషు సర్వదా !!

**వినాయకచవితి శుభాకాంక్షలు!!**

- నన్నయవాణి




ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవ

**శుభాకాంక్షలు!!**

- నన్నయవాణి

## తెలుగు వెలుగు



తెలుగుదనము వంటి
తీయందనము లేదు,
తెలుగు కవులవంటి ఘనులు లేరు
తెలుగుతల్లి సాధుజన కల్పవల్లిరా!
లలిత సుగుణజాల! తెలుగుబాల!!

-- కరుణశ్రీ

మా తెలుగుతల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు!!

-- శంకరంబాడి సుందరాచారి

తెలుగు భాషాదినోత్సవం

**చిత్రం: హంపి**


# నన్నయలో టంగుటూరి జయంతి




టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న వీసీ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. యూనివర్సిటీ ఈసి హాల్లో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి వీసీ మొక్కా జగన్నాథరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతీయ న్యాయనిపుణుడు, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్త మరియు ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు అందరికీ చిరస్మరణీయులని అన్నారు. "గో బ్యాక్ సైమన్ కమిషన్" అనే నినాదంతో బ్రిటిష్ వారిని గడగడలాడించారన్నారు. అపరిమితమైన ధైర్యసాహసాలతో ఆంధ్ర కేసరి (ఆంధ్ర సింహం) అని గౌరవంగా పిలువబడ్డారన్నారు. ప్రకాశం పంతులు లండన్‌లో బారిస్టర్ కోర్సు పూర్తి చేసారన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆయన పేరుతో ఉన్న విద్యాసంస్థలు నేటికీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో విద్యాభివృద్ధికి చిహ్నాలుగా ఉన్నాయని తెలిపారు. అటువంటి మహనీయుని స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డా.ఎం.గోపాలకృష్ణ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## మంచిమాట



మాటలను ప్రోగు చేసేది నిజమైన విద్యకాదు. ప్రజ్ఞను పెంపొందించేదే విద్య. సంకల్పశక్తిని సరైనరీతిలో, నైపుణ్యంగా ఉపయోగించేలా వ్యక్తులకు ఇచ్చే శిక్షణే విద్య.

Is education book - learning? No. Is it diverse knowledge? Not even that. The training by which the current and expression of will are brought under control and become fruitful is called education.

- స్వామి వివేకానంద.

## సంపాదకీయం



## పలుకే బంగారమాయెనా..

మాట అంటే పలుకే కదా. పదాల సమూహమే కదా. నిరంతరం మనం ఎంపిక చేసుకునే పదాలే మన గమ్యాన్ని నిర్ణయిస్తాయంటారు రాబిన్స్. మనం ఏ పదాలనైతే పదేపదే పలుకుతుంటామో అవి మనలోనే భాగమవుతాయి. అందువల్ల మనం మాట్లాడే ముందు పదాలను శ్రద్ధగా ఎంపిక చేసుకోవాల్సిన అవసరముంది.

శబ్దానికి అనూహ్యమైన శక్తి ఉంది. శబ్దశక్తి అంటాం. మనిషిని నిలబెట్టేది, పడగొట్టేది మాటే కదా! పదాలు ప్రకాశవంతమైన భవిష్యత్తును అందిస్తాయి. వచ్చిన అవకాశాన్ని జారిపోయేలా కూడా చేస్తాయి. మనిషి మాట్లాడే మాటలే అతనిపై నమ్మకాన్ని బలోపేతం చేస్తాయి. జంగిల్ బుక్ రాసిన నోబెల్ పురస్కార గ్రహీత రుడ్యార్డ్ క్లిప్పింగ్ 'మానవాళి ఉపయోగించే మాదకద్రవ్యాలన్నింటికంటే మాట్లాడే పదాలే శక్తివంతమైన మాదకద్రవ్యం' అంటారు.

ప్రతికూలమైన, వ్యతిరేకమైన పదాల్ని ఎన్నుకుని మాట్లాడే వ్యక్తులు అభివృద్ధి చెందే వ్యవస్థకు హానికరమైన వారు. వారి మాటల వల్ల సానుకూల దృక్పథం కలిగిన వారు కూడా తటస్థంగా ఉండిపోతారు లేదా అటువంటి సమూహంలో చేరిపోతారు. ఒకటి మాత్రం నిజం. ప్రతికూలమైన పదాలు ప్రయోగించే వ్యక్తుల ఫలితాలు కూడా ప్రతికూలంగానే ఉంటాయి.

వ్యక్తి మాట్లాడే పదాలే అతని మనోస్థితిని, స్వభావాన్ని, వైఖరిని ప్రతిబింబిస్తాయి. తీవ్రమైన కోపంతో, ఈర్ష్యతో రగిలిపోతూ ఎదుటివారిని దూషించే సమయంలో మనిషి హావభావాల్లో, ప్రవర్తనలో నాటకీయమైన మార్పులు కలుగుతాయి. శరీరంలో రక్త పోటు కూడా అధికమవుతుంది. శరీరం ఉద్రేకంతో ఊగిపోతుంది. ఏం మాట్లాడుతున్నారో, ఎవరి గురించి మాట్లాడుతున్నారో మర్చిపోతారు. పదాల ప్రయోగ తీవ్రత పెరిగే కొద్దీ ఉద్రేకం కూడా తీవ్రతరమవుతుంది. భాష ఉద్రేక పరుస్తుంది, శాంత పరుస్తుంది కూడా.

ప్రతికూలమైన ఉద్వేగాన్ని పోగొట్టుకుని మానసికంగా కుదుట పడటానికి సూత్రం ఏమిటంటే ఎదుటివారి గురించిన ఆలోచనను తగ్గించుకోవటమే. ఎదుటివారిని భూతద్దంలో చూడటం మానేయటమే. ఒంటరిగా ప్రశ్నించుకుంటే తానేంటో ప్రతి మనిషికి అర్థమవుతుంది. "నిన్ను నీవు తెలుసుకో!" అంటారు అరిస్టాటిల్.

నోటి నుండి వెలువడే ఆనందకరమైన పదాలే మనల్ని ఉత్తేజంగా ఉరకలు వేయిస్తాయి. సంతోష తీరాల వైపుకు నడిపిస్తాయి. ఇతరుల పట్ల సానుకూలంగా స్పందించే ప్రతి మనిషి తన పట్ల కూడా తాను సానుకూలంగా ఉంటాడు. మసకబారిన అద్దంలో నుంచి చూసిన ప్రకృతికి, స్వచ్ఛమైన అద్దంలో నుంచి చూసిన దృశ్యానికి ఎంత తేడా ఉంటుందో మనిషి తాను ప్రయోగించే పదాలు కూడా అంతే. మనం ఎన్నుకున్న పదాలే మనల్ని అటువైపునకు నడిపిస్తాయి.

*మాటే మంత్రం! మాటే మిత్రుడు! మాటే శత్రువు!*

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించండి

**25.08.22 (మీడియాసెల్)** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతల పరిణామాలపై పట్టు సాధిస్తే టెక్నాలజీ రంగంలో ఎక్కువ అవకాశాలు ఉంటాయని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో గురువారం సెమినార్ ను నిర్వహించారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ వెహికల్ టూ ఎవ్రిథింగ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అనే అంశంపై జరిగిన ఈ సెమినార్ కు సభాధ్యక్షులుగా ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కన్వీనర్ గా ఇ.సి.ఇ. కోర్సు కోఆర్డినేటర్ బి.సుధాకిరణ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతలలో తాజా పరిణామాలు ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్స్ (ITS)కి కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. వాహన సెన్సార్లు కూడా కాలక్రమేణా అప్ డేట్ అవుతున్నాని, ఫలితంగా వాహనాలు పర్యావరణాన్ని బాగా అంచనా వేస్తున్నాయన్నారు. ఈ పురోగమనం మానవ లోపాలను తగ్గించేటప్పుడు మానవ డ్రైవింగ్ ప్రవర్తనను అనుకరించే ఆలోచనపై ఆధారపడిన స్వయంప్రతిపత్తి డ్రైవింగ్‌ను గ్రహించే అవకాశం ఏర్పడుతున్నాయన్నారు. సక్రియ మరియు నిష్క్రియ రహదారి భద్రత నుండి స్వయంప్రతిపత్తి వాహనాల నుండి వాహనాల ఇంటర్నెట్ వరకు ఆప్టిమైజింగ్ ట్రాఫిక్ వరకు అనేక అప్లికేషన్‌లు అభివృద్ధి చేయబడ్డాయని చెప్పారు. వెహికల్ టూ ఎవ్రిథింగ్ కమ్యూనికేషన్ సిస్టమ్‌లో ట్రాఫిక్ సామర్థ్యం, రహదారి భద్రత మరియు శక్తి సామర్థ్యాలు వంటి ప్రధాన అంశాలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ ఫ్లో సమాచారం. ట్రాఫిక్ రద్దీని సరిదిద్దడం, ప్లగ్-ఇన్ ఎలక్ట్రిక్ వెహికల్ (PEV) ఛార్జ్ యొక్క మెరుగైన వినియోగం, ఇంధన వినియోగాన్ని తగ్గించడం మరియు స్థాన ఆధారిత సేవలను మెరుగుపరచడం వంటి పనులను అమలు చేయడానికి వాహన అనువర్తనాలు ఈ సమాచారాన్ని ఉపయోగించవచ్చని చెప్పారు. ట్రాఫిక్ ఫ్లో డేటాసెట్‌ను క్లోజ్డ్-సర్క్యూట్ టెలివిజన్ (CCTV) కెమెరాలు,



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

ఇండక్షన్ లూప్‌లు, క్రౌడ్ సోర్సింగ్ ఆధారిత సమాచార సేవలు మరియు వాహనాలు వంటి బహుళ మూలాల నుండి పొందవచ్చునన్నారు. నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తరువాత ఎన్.ఐ.టి. ఆంధ్రప్రదేశ్ ఈ.సి.ఈ విభాగాధిపతి డా.జి.కిరణ్ కుమార్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ వెహికల్ టూ ఎవ్రిథింగ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సాంప్రదాయిక ట్రాఫిక్ ప్రవాహ అంచనా పద్ధతులను ఉపయోగించి అత్యంత ఖచ్చితమైన ట్రాఫిక్ ప్రవాహ అంచనా అల్గారిథమ్‌లను రూపొందించడం వంటి విషయాలను వివరణాత్మకంగా తెలియజేసారు. కంప్యూటర్ విజన్, డేటా సైన్స్, రోబోటిక్స్, మెడికల్ మరియు నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వంటి రంగాలలో ప్రిడిక్షన్ అల్గారిథమ్ల రూపకల్పన కోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విస్తృతంగా వర్తించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కన్వీనర్ బి.సుధాకిరణ్, కోకన్వీనర్స్ ఈసీఈ విభాగాధ్యాపకులు ఎ.విజయదుర్గ, బి.కృష్ణ, బి.యానికెజియా, పి.వెంకటరత్నం, ఎన్.సంతోషి మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవకు ప్రతిరూపం మదర్ థెరీసా

**నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్**

**26.08.22 (మీడియాసెల్)** సేవకు ప్రతిరూపం మదర్ థెరీసా అని, ఆమెను ఆదర్శంగా తీసుకొని అందరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. శుక్రవారం నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్లో మదర్ థెరీసా 112 వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి విశ్వవిద్యాలయ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో ప్రపంచానికి ఆదర్శమూర్తిగా నిలిచిన మదర్ తెరిసాను



మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. "మనం చేసే సాయం సముద్రంలో బిందువంతే కావచ్చు, కానీ అది కూడా చేయకపోతే సముద్రం ఒక బిందువును కోల్పోతుంది" అని చెప్పిన మదర్ థెరిసా మాటలు అందరికీ ఆదర్శనీయమన్నారు. ఓ ఎస్ డి ఆచార్య టేకి మాట్లాడుతూ తనదైన మార్గంలో నిరాడంబరంగా సేవా దృక్పథంతో ప్రపంచానికి మానవత్వ వాదాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి మదర్ దెరిసా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య పి. సురేష్ వర్మ, సి.డి. సి ఫ్యాకల్టీ అసోసియేట్ డా.పదాల రాజశేఖర్, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మంచిమనిషి' పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ జగన్నాథరావు

ప్రముఖ కవి రచయిత ఎస్.ఆర్. పృథ్వి రచించిన మంచి మనిషి కథలు పుస్తకాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఈసీ హాల్ లో మంచిమనిషి కథల సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై, పుస్తకాన్ని ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. ఎస్ ఆర్ పృథ్వి ప్రముఖ కవి రచయితగా ఎన్నో సాహిత్య రచనలు చేశారన్నారు. పృథ్వి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రైల్వే కోర్టులో పనిచేసి రిటైర్డ్ అయ్యారని చెప్పారు. ఆయనకు సాహిత్యం పట్ల ఉన్న అపరిమితమైన ఆసక్తిని బట్టి ఎన్నో సాహిత్య రచనలు చేశారన్నారు.




మంచి మనిషి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

సాహిత్యంలోని 25 రకాల ప్రక్రియలలో పృథ్వి రచనలు చేశారని చెప్పారు. గజల్స్, సమీక్ష, నాటకం, కథ, నానీలు, హైకూలు వంటి అనేక రకాల రచనలు వెలువడ్డాయన్నారు. పృథ్వి 35 సాహిత్య పుస్తకాలు రచించి, ప్రచురించారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్ డి ఆచార్య ఎస్.టేకి, నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్ర సమన్వయకర్త డా. తలారి వాసు, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.కె. రాజరాజేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజమండ్రి గవర్నమెంట్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ డే



**26.08.22 (మీడియాసెల్)** శుక్రవారం ప్రభుత్వ అటానమస్ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించారు. డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు గౌన్లు ధరించి నెత్తిన టోపీ పెట్టుకుని పట్టాలు అందుకున్నారు. 2015 నుంచి డిగ్రీ పాసైన విద్యార్థులతో ప్రాంగణం నిండిపోయింది. ఆదికవి నన్నయ యూనివర్శిటీ వీసీ జగన్నాథరావును ఎన్సీసీ పరేడ్ తో స్వాగతం పలికారు. కమిషనర్ భాస్కర్ ని మేళతాళాలతో ఆహ్వానించారు. ఆర్ట్స్ కళాశాలలో గతంలో చదివి నేడు ఉన్నత స్థానంలో ఉన్న కొంతమంది ప్రముఖులను సభావేదిక పైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ 169 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గల ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మెట్టమొదటి సారిగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం అభినందనీయమన్నారు. డిగ్రీ అయిపోగానే ఏదో సాధించామని సంబరపడటంకాదన్నారు. ఇప్పటివరకూ తరగతి గదులలోనే ఉన్నారని, ఇకపై చదివిన చదువుతో జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి ప్రయత్నించాలన్నారు. పోలా భాస్కర్ మాట్లాడుతూ ఐదేళ్ల ప్రాయం నుంచి స్కూల్ జీవితం ప్రారంభం అవుతుందన్నారు . అప్పటి నుంచి డిగ్రీ పట్టా సాధించే వరకూ 15 సంవత్సరాలపాటు తరగతి గదిలో ఉంటామన్నారు . డిగ్రీ సాధించాక జీవిత పోరాటం మొదలవుతుందన్నారు. ఈ దశలో పట్టుదల సాధించగలననే ఆత్మ విశ్వాసం చాలా అవసరమన్నారు . ఈ రెండూ జీవితంలో ఎదుగుదలకు దోహదపడతా యన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, జాయింట్ డైరెక్టర్ రాపాక దేవిడ్ కుమార్ మాట్లాడుతూ 1,682 మందికి డిగ్రీ పట్టాలను అందించామన్నారు. 2015

## విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



2018 , 2016-19 , 2017-2020 వరకూ డిగ్రీ పాసైన వారికి డిగ్రీ సర్టిఫికెట్లను అందజేశారు. పూర్వ విద్యార్థులకు మెమెంటోలను బహూకరించారు. అంతకుముందు కమిషనర్ ఆఫ్ కాలేజీయట్ ఎడ్యుకేషన్ డా.పోలా భాస్కర్ ను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఆర్జేడీ డా.చప్పిడి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు.









# నన్నయలో సైబర్ పీస్ క్లబ్ ప్రారంభం

**26.08.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సైబర్ పీస్ క్లబ్ ను ప్రారంభించారు. యూనివర్సిటీ సెమినార్ హాల్లో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ ఎస్ డి ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా. వి. పెర్సెస్, ఎస్ ఆర్ ప్రాజెక్ట్ మేనేజర్, సైబర్ సెక్యూరిటీ ఎక్స్పర్ట్ ఐ ఎల్ నర్సింహారావు హాజరై సైబర్ పీస్ క్లబ్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓ ఎస్ డి ఆచార్య టేకి మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగంలో సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. విసి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో విశ్వవిద్యాలయ విద్యార్థులకు సైబర్ సంబంధిత అంశాలపై చక్కని కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సైబర్ సెక్యూరిటీ ఎక్స్పర్ట్ ఐ ఎల్ నర్సింహారావు మాట్లాడుతూ సైబర్పీస్ ఫౌండేషన్ వారి వినూత్నమైన సైబర్పీస్ క్లబ్ల ద్వారా ఆన్లైన్లో పిల్లల సంక్షేమం మరియు ఎదుగుదల కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులు మరియు అధ్యాపకులచే నడిచే టాస్క్ఫోర్స్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆన్లైన్లో పిల్లల రక్షణ చుట్టూ తిరుగుతున్న అంతరాన్ని తగ్గించడం మరియు ఇంటర్నెట్లో అవకాశాలు, బెదిరింపులు మరియు ప్రమాదాల గురించి వారి జ్ఞానాన్ని ప్రారంభించడం సైబర్పీస్ క్లబ్ల లక్ష్యమన్నారు. పాఠశాలలోని విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది సైబర్ సెక్యూరిటీ, నెట్వర్క్ ప్రముఖ సైబర్ సెక్యూరిటీ కమ్యూనిటీ, ఆలోచనలను పంచుకోవడం మరియు ఆసక్తిగల విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బందికి సంబంధించిన అంశాలపై శిక్షణ పొందడం గురించి సంబంధిత వనరులను నేర్చుకునే మరియు యాక్సెస్ చేసే మార్గాన్ని అందించడం కూడా క్లబ్ లక్ష్యమన్నారు. కంప్యూటర్ మరియు నెట్వర్క్ భద్రతకు ఉపయోగకరమని చెప్పారు. ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ క్లబ్ సభ్యులు పరిశోధన ప్రాజెక్టులు చేపట్టి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తామన్నారు. డొమైన్లోని ట్రెండ్ల గురించి ఏకరూపతను మరియు అప్డేట్ను నిర్ధారించడానికి, సైబర్ సెక్యూరిటీ మరియు శాంతి విషయంపై అవగాహన కల్పించడానికి క్లబ్లు పనిచేస్తాయన్నారు. ఈ కౌన్సెలింగ్, మార్గదర్శకత్వం ద్వారా సైబర్క్రైమ్ బాధితులకు మద్దతు ఇవ్వడం ద్వారా క్లబ్లు సమాజానికి కూడా సేవలు అందిస్తాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న వీసీ జగన్నాధరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ ఎస్ డి ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా. వి. పెర్సెస్, ఎస్ ఆర్ ప్రాజెక్ట్ మేనేజర్, సైబర్ సెక్యూరిటీ ఎక్స్పర్ట్ ఐ ఎల్ నర్సింహారావు, కన్వీనర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు కోకన్వీనర్ మంచెం శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డి.దాసు, పి.ఎస్.వి.డి.గాయత్రి, శిరీష, రాహుల్ పాల్ మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ పీస్ క్లబ్ బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు

# అద్విక 22 విజయవంతం చేయండి

## బ్రోచర్ను ఆవిష్కరించిన వీసీ జగన్నాథరావు




బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

**25.08.22 (మీడియాసెల్)** ఇంజనీర్స్ డే సెలబ్రేషన్స్ లో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహిస్తున్న "అద్విక22" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పిలుపునిచ్చారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అద్విక22 బ్రోచర్ ను వీసీ జగన్నాథరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సెప్టెంబర్ 15 భారతరత్న శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి మరియు ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో అద్విక22 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. అద్విక22 కి కన్వీనర్ గా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ వ్యవహరిస్తున్నారన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంతో పాటు ఇతర కళాశాలల నుండి విద్యార్థులు పెద్దఎత్తున హాజరయ్యే విధంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అద్విక22 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. అద్విక22 ఈవెంట్స్ లో ప్రత్యేకంగా టెక్నికల్ టాక్, పోస్టర్ ప్రెజెంటేషన్, క్విజ్, ప్రోజెక్ట్ ఎక్స్ పో, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ఆన్లైన్ గెమింగ్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు www.advika22.com ద్వారా రిజిస్టేషన్ చేయించుకోవచ్చునని తెలియజేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకుల సంయుక్త నిర్వహణలో అద్విక22 ను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, సిడిసి డీన్ డా.పి.వెంకటేశ్వర రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అందమైన విప్లవం


## పుస్తకం



ఐదు వందల ఏళ్ల క్రితం యూరోప్ లో ఒక అద్భుతమైన మేధావిప్లవం మొదలైంది.దాని పేరే పునరుద్దీపన యుగం. వెయ్యేళ్ళపాటు అక్కడ మతం గుప్పెట్లో నలిగిన మేధ క్రమంగా సంకెలలు తెంచుకుంది. సరికొత్త కళ్ళతో ప్రపంచాన్ని చూసింది. చిత్రకళ,శిల్పకళ, స్థాపత్య కళ, సాహిత్యం, సంగీతం...ఇలా ప్రతి మానవీయ రంగంలోనూ కొత్త పుంతలు తొక్కింది. దృష్టి దేవుడి నుంచి మనిషి మీదకి మరల్చింది. ధ్యాస దివి నుండి భువికి మార్చింది. మానవ జీవనాన్ని, ప్రపంచాన్ని అందంగా తీర్చిదిద్దాలనుకుంది. ఆ అందమైన విప్లవం కథ ఈ పుస్తకం.

యూరప్ పునరుద్దీపన యుగంలోని కళల గురించి గొప్పగా విశ్లేషించిన పుస్తకమిది. కొన్ని విప్లవాలు ప్రపంచంలో ఓ ప్రాంతంలో మొదలై కొన్నాళ్లు వెలిగి ఆరిపోతాయి.మరికొన్ని విప్లవ కెరటాలు అరుదైనవి.అవి ఏదో ఒక చోట మొదలైనా దశలవారీగా యావత్ ప్రపంచాన్ని ముంచెత్తుతాయి.యూరప్ లో మొదలైన పునరుద్దీపన స్ఫూర్తి యొక్క పర్యవసానాలు తదుపరి శతాబ్దాలలో దశల వారీగా ప్రపంచమంతా విస్తరించి మానవ జీవనం మీద గాఢమైన ప్రభావాన్ని చూపించాయి.చారిత్రక విప్లవాల వలె ఈ విప్లవానిది రక్త చరిత్ర కాదు. ఇది ఒక అందమైన విప్లవం. మానవ మేధా లోతుల్లో దాగిన అలౌకికమైన, అమేయమైన, అపారమైన సౌందర్యాన్ని తవ్వి తీసి దానిని కళా సృష్టిలో అభివృద్ధి చేసి మానవ జీవనాన్ని, మానవ ప్రపంచాన్ని అతి సుందరంగా రూపాంతరీకరించాలని మహోన్నతమైన లక్ష్యం గల మధుర విప్లవాన్ని ఈ పుస్తకం అద్భుతంగా వివరించింది. అతి సుందర భావి భారతానికి ఈ పుస్తకాన్ని అంకితం చేస్తున్నానంటారు రచయిత ఆచార్య వి. శ్రీనివాస చక్రవర్తి.

ఆయన విశాఖపట్నంలో పుట్టారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఐఐటి మద్రాస్ లో బీటెక్ పట్టా పుచ్చుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ నుంచి అదే సబ్జెక్టులో డాక్టరేట్ పొందారు.బెయిలర్ కాలేజీ ఆఫ్ మెడిసిన్ నుంచి న్యూరో సైన్స్ రంగంలో శిక్షణ పొందారు. ప్రస్తుతం ఐఐటి మద్రాసులో బయోటెక్నాలజీ విభాగంలో ఆచార్యులుగా సేవలందిస్తున్నారు. పాపులర్ సైన్స్ పుస్తకాలు రాయడం ఆయన హాబీ.




ఇటీవలే ఆయన ప్రాచీన రోమన్ చరిత్ర పైన కూడా ఒక పుస్తకాన్ని విలువరించారు.కళా సాహిత్య మేధారంగాల్లో చిగురించి వికసించిన మనోహరమైన పరిమళభరిత కుసుమాల గురించి ఆయన తెలుగు లోకానికి అందించిన పుస్తకం 'అందమైన విప్లవం '. ఇప్పటివరకు ఆయన 60 పుస్తకాలు రచించారు. వందల సంఖ్యలో పాఠశాలలకు, కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు ఆయనే ఉచితంగా అందించారు .ఈ పుస్తకాన్ని పీకాక్ బుక్స్ గాంధీ గారు అందంగా ప్రచురించారు.ఇది ఇటీవల ప్రచురించిన చదవాల్సిన మంచి పుస్తకం.

# అప్లైడ్ మ్యాథమెటిక్స్ ఫేర్‌వెల్ పార్టీ













